క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ప్రకాష్‌నగర్, ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ బానోతు చరణ్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రకాష్ నగర్ ఎక్స్‌టెన్షన్ ఏరియా, ఆర్కా మసీదు, రిజిస్ట్రేషన్ ఆఫీస్ లేన్, ఎయిర్‌టెల్. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐసీఐసీఐ బ్యాంక్ లేన్, భగవంతాపూర్, గగన్‌విహార్ కాలనీ, షేర్‌ఖాన్ బస్తీ, ఇంటర్‌గ్రాఫ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.63, నల్లవంకాయ 40, పాడుగు వంకాయ 40, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 50, పందిరి బీర 40, క్యాబేజీ 26, క్యారెట్ 45, దొండ 35, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 75, గోకరకాయ 35, కీర 20, దోసకాయ 23, బీట్‌రూట్ 26, ఉల్లిగడ్డ 19, ఆలుగడ్డ 22, చామగడ్డ 40, మొరంగడ్డ 35, కందగడ్డ 35, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

రేపు పురోహిత అర్చక వెల్ఫేర్ సొసైటీ సమావేశం

లాలాపేట: బ్రాహ్మణుల ఉన్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తూ పాటుపడుతున్నామని తెలుగు, తెలంగాణ పురోహిత అర్చక వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు చల్ల పీఎస్ అంజనేయ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 10న వేములవాడలోని శంకరమఠంలో తెలుగు, తెలంగాణ పురోహిత అర్చక వెల్ఫేర్ సొసైటీ ద్వితీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి సొసైటీ వ్యవస్థాపకులు ఎండీ రామకృష్ణ, దేవులపల్లి కామేశ్వర శర్మ, రాజన్న సిరిసిల్లా అధ్యక్షులు ప్రతాపరామకృష్ణ, డాక్టర్, మధు, ఫణి కృష్ణ హాజరవుతారన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ముప్పిడి మధుకర్

కంటోన్మెంట్: నిరుపేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ సంజీవనిలా ఉపయోగపడుతుందని బీఆర్ఎస్ సీనియర్ నేత ముప్పిడి మధుకర్ అన్నారు. నాచారం ప్రాంతానికి చెందిన జే.సాగర్ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో సాయం కోసం ముప్పిడి మధుకర్‌ను ఆశ్రయించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేయించగా రూ.2 లక్షలు మంజూరైంది. సంబంధిత ఎల్‌వోసీ పత్రాన్ని మంగళవారం లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో ప్రవీణ్ యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమానికి 80 ఏళ్లు



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించిన ప్రసూన

అమీర్‌పేట: క్విట్ ఇండియా ఉద్యమానికి 80 ఏళ్లు పూర్తవుతుందని సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన అన్నారు.క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం బల్కంపేటలోని మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 1942 ఆగస్టు 8న మహారాష్ట్రలోని ముంబాయిలో క్విట్ ఇండియా ఉద్యమానికి శ్రీకారం చుట్టారని బ్రిటీష్ పాలకులకు ఈ ఉద్యమం ముచ్చెమటలు పట్టించిందని గుర్తు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శంకర్ రాజు

రసూల్‌పురా: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బైసన్ పోలో మైదానంలో శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లకు బేగంపేట ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ఏసీపీ జి. శంకర్ రాజు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ వినియోగం, మైనర్ డ్రైవింగ్‌తో తలెత్తే పరిణామాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ గ్రూప్ కెప్టెన్ శ్రీ, క్యాంప్ కమాండెంట్ కేఎం. వేణుగోపాల్, షేక్ ఫథామియా, ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



వరదొచ్చినా..డోంట్ వర్రీ!

నాడు రోజుల తరబడి ఇళ్ల మధ్యనే నీరు, నేడు గంటలోపే మటుమాయం

- సత్ఫలితాలిస్తున్న ఎస్ఎన్‌డీపీ పనులు
- బేగంపేట నాలా పరీవాహక ప్రాంతాల్లో రూ.45 కోట్లతో కొనసాగుతున్న పనులు

సనత్‌నగర్: వానొస్తే వరదొస్తది..వరదొస్తే ఆ ప్రాంత ప్రజల గుండెల్లో గుబులు పుడుతుంది. ఔను గంట పాటు వర్షం దంచి కొట్టిందంటే..రోజుల తరబడి వరద నీటిలోనే సహవాసం చేయాల్సిన దుర్భర పరిస్థితి వారిది. అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి సహాయక చర్యలు చేపడితే తప్ప నిస్సహాయస్థితి వారిది. అంతెందుకు ఇక్కడ వరదల భయానికి ఇళ్లు కూడా ఖాళీ చేసి వెళ్లిపోయారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉండేదో అర్థమవుతోంది. ఇదీ బేగంపేట నాలా పరీవాహక ప్రాంతాలైన మయూరిమార్గ్, అల్లంతోటబావి, బ్రాహ్మణవాడీ, వడ్డెరబస్తీ, చీకోటి గార్డెన్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంత నివాసితుల ఒకప్పటి పరిస్థితి. కానీ నేడు..సమగ్ర నాలా అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ) ద్వారా చేపట్టిన నాలా అభివృద్ధి పనులు ఇక్కడి ప్రాంత ప్రజలకు వరద ప్రభావం నుంచి విముక్తి కలిగినట్లే కనిపిస్తోంది. ఎందుకంటే ఇటీవల ఏకధాటిగా వారం రోజుల పాటు వర్షాలు కురిసినప్పటికీ వరద గంట వ్యవధిలోనే బయటకు వెళ్లిపోవడంతో ఆయా బస్తీల ప్రజల వరద కష్టాలు కొంతమేర తీరిందనే చెప్పవచ్చు.

గత అనుభవాలే పాఠంగా..

సీఎం క్యాంప్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఈ ప్రాంతాలు ఉన్నప్పటికీ తమ రాతలు ఇంతేనా? అంటూ బాధపడిన సందర్భాలు కోకొల్లలు. గత ఏడాది వర్షాకాలం చివరిలో వరుణుడు ప్రతాపానికి ముంచెత్తిన వరదలతో కనీసం బయటకు రాలేని పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. అంతేకాదు..వారం రోజుల పాటు వరదనీరు బస్తీల్లోనే తిష్ట వేసి ఉన్నాయి. ఆ సమయంలో మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు పర్యటించారు. ఇక్కడి పరిస్థితులను చూసి చలించిపోయిన కేటీఆర్ ఇక్కడి లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు సమస్యను దూరం చేసేలా రూ.45 కోట్లను మంజూరు చేసి ఎస్ఎన్‌డీపీ కింద నాలా అభివృద్ధి పనులు చేపట్టేలా చేశారు.

మంత్రి చొరవతో సమస్య కొలిక్కి..



బేగంపేట నాలా అభివృద్ధి గురించి గత ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోలేదు. వర్షాలు పడుతున్నాయంటే భయం భయంగా గడిపేవారు. అలాంటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రత్యేక చొరవ మంత్రి కేటీఆర్ సహకారంతో రూ.45 కోట్లు మంజూరయ్యేలా చేశారు. ఇప్పుడు పూర్తి స్థాయిలో నాలా అభివృద్ధి పనులు జరుగుతుండడంతో ఇటీవల ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసినా వరద నీరు అరగంటలో బయటకు వెళ్లిపోయింది.

– మహేశ్వరిశ్రీహరి, కార్పొరేటర్



గతేడాది కురిసిన వర్షాలతో నీటమునిగిన చీకోటి గార్డెన్

ఎస్ఎన్‌డీపీతో మారిన చిత్రం..

ప్రాజెక్టులో భాగంగా బేగంపేట కట్టమైసమ్మ ఆలయం నుంచి పీవీ నరసింహారావు మార్గ్ (నెక్లెస్ రోడ్డు) వరకు సుమారు అర కిలోమీటర్ పొడవున్న నాలా పూడికతీత పూర్తి చేశారు. నాలాకు రెండు వైపులా 8–10 అడుగుల వరకు ఎత్తు పెంచుతూ ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. నాలా వెంట బస్తీల్లో మంచినీటి పైప్‌లైన్లతో పాటు వరద తీవ్రత పెరిగినా ఎప్పటికప్పుడు నీరు బయటకు వెళ్లేలా వరద, మురుగునీటి కాలువలను అభివృద్ధి చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అదనపు పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. నాలా ఇరువైపులా ఉన్న బస్తీల్లో వీడీసీసీ రోడ్లు వేస్తున్నారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హేమ

చిలకలగూడ : అర్హులైన వారంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కోరారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావు ఆదేశాల మేరకు సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఓటరు నమోదు శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఇతర గుర్తింపు పత్రాలతో ఓటరు నమోదు శిబిరంలో సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో కూడా ఓటరు నమోదు చేసుకుని వెసులుబాటు ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎన్నికల సూపర్‌వైజర్ భుజేందర్, బీఆర్ఎస్ నాయకులు జలంధర్‌రెడ్డి, రాజుసుందర్, బాలాజీ, అనీల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ సరళ

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం



అవగాహన కల్పిస్తున్న సునంద

అమీర్‌పేట: తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బల్కంపేట బీజేఆర్‌నగర్ కమ్యూనిటీహాల్లోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. తల్లిపాల విశిష్టత గురించి నేటితరం మహిళలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు.బాలింతలు పోషక విలువలు కలిగి ఆహారం తీసుకుంటూ బిడ్డకు తల్లి పాలు తప్పకుండా అలవాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, రేవతి పాల్గొన్నారు.

బోయబస్తీ కమ్యూనిటీహాల్‌లో..

అడ్డగుట్ట: పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని సీడీపీఓ సునంద అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తుకారాంగేట్‌లోని బోయబస్తీ కమ్యూనిటీహాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా తల్లి ముర్రుపాలు పట్టాలని, అది పిల్లలకు టీకాలాగా పని చేస్తుందని చెప్పారు. అదే విధంగా ఆర్యజనని సంస్థ సభ్యులు గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాధారణ ప్రసవం కోసం చేయాల్సిన వ్యాయామాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ రేణుక, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అడ్డగుట్ట: రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దయాకర్ వివరాల ప్రకారం.. అడ్డగుట్ట బీ-సెక్షన్‌కు చెందిన మదన్‌గోశ్ (52) ఇళ్లల్లో పని చేస్తుంటాడు. సోమవారం పని ముగించుకొని రాత్రి 10.30 గంటలకు డెక్కన్ క్లబ్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో అడ్డగుట్టకు చెందిన ఆంటోని (22), బబ్లూ(21) బైక్‌పై అతివేగంగా వచ్చి మదన్‌గోశ్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులకు కూడా గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన అధ్యాపకుల పాదయాత్ర

ఉస్మానియా యూనివర్సిటీ: సిద్దిపేట జిల్లా కోయినపల్లి వేంకటేశ్వర ఆలయం వరకు కాంట్రాక్ట్ అధ్యాపకులు చేపట్టిన పాదయాత్ర ముగిసింది. మంగళవారం తెలంగాణ ఆల్ వర్సిటీస్ కాంట్రాక్టు టీచర్ల జేఏసీ వర్కింగ్ చైర్మన్ డాక్టర్ రామేశ్వర్ రావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేస్తామని 2015లో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఇచ్చిన హామీకి ఆటంకాలు తొలగించాలని పూజలు చేయించి వేంకటేశ్వరస్వామి పాదాల చెంత వినతి పత్రాన్ని ఉంచాలని పూజారికి అందజేశారు. అనంతరం సీఎం కేసీఆర్‌కు వినతి పత్రాన్ని పోస్టుద్వారా పంపించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ డా.శ్రీధర్‌కుమార్‌లోధ్, పల్లా రేష్మరెడ్డి, కన్వీనర్ రాజేష్‌ఖన్నా, కోకన్వీనర్ వెంకటేష్, కో-చైర్మన్లు డా.హరీష్, డా.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పూజారికి వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు

ఓటు హక్కును వినియోగించుకోవాలి



కంటోన్మెంట్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందని ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. 'కంటోన్మెంట్ కనెక్ట్' పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం పికెట్ లక్ష్మీనగర్‌లో యువతీ, యువకులతో సమావేశమై మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయించుకోవాలన్నారు. త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో కంటోన్మెంట్‌లో ఓటింగ్ శాతం గణనీయంగా పెరగాలన్నారు. ముఖ్యంగా యువత నూరుశాతం ఓటింగ్‌లో పాల్గొనాలని సూచించారు.

గ్రూప్-2ను వాయిదా వేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్-2ను వాయిదా వేయాలని ఆందోళన చేపట్టిన ఓయూ విద్యార్థి జేఏసీ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం గ్రూప్-2 వాయిదాకు ప్రగతి భవన్ ముట్టడి యూనివర్సిటీ లైబ్రరీ నుంచి చేపట్టిన ర్యాలీని అడ్డుకుని విద్యార్థులను అరెస్ట్ చేయడంతో ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆగస్టులో 1 నుంచి 23 వరకు గురుకుల ఉద్యోగాల పోటీ పరీక్షలు ఉన్నాయని వెంటనే గ్రూప్-2 నిర్వహిస్తే ఎలా అని ప్రశ్నించారు. సిలబస్ మారినందున ఈ నెల 29, 30న నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు రాత పుస్తకాల పంపిణీ



పుస్తకాలను పంపిణీ చేస్తున్న సారా

అడ్డగుట్ట: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సహాయ సహకారాలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సెవెన్ రేస్ ఫౌండేషన్ ప్రతినిధురాలు డాక్టర్ సారా అన్నారు. సాయినగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం ఆమె రాత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సారా మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థుల సహాయార్థం తమవంతు కృషిగా రాత పుస్తకాలతో పాటు ఇతర స్టేషనరీ పంపిణీ చేసినట్లు తెలిపారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలన్నారు.

సనత్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



ఎస్ఆర్‌నగర్‌లో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించిన మంత్రి తలసాని

సనత్‌నగర్/అమీర్‌పేట: సనత్‌నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలో రూ.30 వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ముందుగా సనత్‌నగర్ బస్టాండ్ వద్ద సనత్‌నగర్ మెయిన్ రోడ్డుపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్, జెక్‌కాలనీలోని గాంధీ విగ్రహం, అమీర్‌పేట డివిజన్‌లోని ఎస్ఆర్‌నగర్ ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజావసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. నిరంతరం ఎంతో రద్దీగా ఉండే సనత్‌నగర్ మెయిన్‌రోడ్డుపై వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రోడ్డు విస్తరణ, డివైడర్ నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. అంతేకాకుండా నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రధాన రహదారులతో పాటు బస్తీలు, కాలనీలలోని అంతర్గత రహదారులను కూడా అభివృద్ధి చేసి, స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా నియోజకవర్గ పరిధిలో ఎక్కడా డ్రైనేజీ లీకేజీలు, డ్రైనేజీ సమస్య, మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎన్ని కోట్ల నిధులైనా ఖర్చు చేసేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, సరళ, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, నాయకులు కొలను బాల్‌రెడ్డి, ఫాజిల్, ఖలీల్‌బేగ్, నోమన్, ప్రవీణ్‌రెడ్డి, రాజేష్, కరీంలాలా, జమీర్, జెక్‌కాలనీ ప్రతినిధులు కొండ్రాజు సుబ్బరాజు, మల్లు ప్రసాద్, సురేష్‌గౌడ్, కూతురు నర్సింహ, హన్మంతరావు, అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న రామకృష్ణ

రసూల్‌పురా: ప్రధాని నరేంద్ర మోదీ కృషితో పది నుంచి వంద గజాల లోపు స్థలం ఉన్న పేదలు ఇళ్లు నిర్మించుకోవాలంటే కంటోన్మెంట్ బోర్డు అనుమతి లభిస్తోందని బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం బోర్డు రెండవ వార్డు రసూల్‌పురాలో బోర్డు నిధులతో భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులు, శివాజీనగర్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రపంచ బ్యాంక్ నుంచి లక్షల కోట్ల అప్పు తీసుకుని ప్రతి ఒక్కరిపై లక్షన్నర అప్పు మోపారని అన్నారు. ఉచితంగా తాగునీరు ఇస్తారని చెప్పారు కానీ.. 90 లక్షల గ్యాలన్లు అవసరముండగా కేవలం 55 లక్షల గ్యాలన్లు విడుదల చేస్తుండడంతో అందరికీ సరిపోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు మాదరపు అశోక్, శివాభిషేక్, రవి, రామాంజనేయులు, మల్లేష్, జగన్, ప్రశాంత్, లక్ష్మణ్, నరేష్, సదానంద్, గంగాధర్ అజయ్, దత్తుసాయికుమార్ పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం తగదు

డిప్యూటీ స్పీకర్ పద్మారావు



అధికారులతో చర్చిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

చిలకలగూడ: ఓటర్ల నమోదు ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా పకడ్బందీగా చేపట్టాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సీతాఫల్‌మండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఓటర్ల నమోదు అంశంపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతన ఓటర్ల నమోదు కార్యక్రమం మరింత చురుగ్గా చేపట్టాలని ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో ఎన్ని ప్రాంతాల్లో ఓటరు నమోదు శిబిరాలు ఏర్పాటు చేశారు.. కాలనీ, బస్తీ, గేటెడ్ కమ్యూనిటీ వాసుల సహకారాలు తీసుకున్నారా.. ప్రజలను చైతన్య పరిచేందుకు ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు వంటి అంశాలపై ఆరా తీశారు. కళాశాలల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు చేపట్టి, అర్హులైన యువతకు అవకాశం కల్పించాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హులైన వారంతా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ సుధాంశ్, కార్పొరేటర్ సామల హేమ, బీఆర్ఎస్ సమన్వయకర్తలు జలంధర్‌రెడ్డి, రాజుసుందర్ పాల్గొన్నారు.

సన్మానం..

రేషన్ డీలర్ల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు, డిప్యూటీ స్పీకర్ పద్మారావును క్యాంపు కార్యాలయంలో మంగళవారం రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ప్రభుత్వంతో జరిగిన చర్చలు సఫలం అయ్యేందుకు కృషి చేసిన పద్మారావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సమాఖ్య జేఏసీ రాష్ట్ర కన్వీనర్ దొమ్మాట రవీందర్, సొసైటీ అధ్యక్షుడు మల్లికార్జునగౌడ్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న యూనియన్ నాయకులు

రసూల్‌పురా: భవనంపై పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మృత చెందిన కార్మికుడికి సెంట్రింగ్ కార్మికుల యూనియన్ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. అన్నానగర్‌కు చెందిన గణేష్ ఆదివారం అల్వాల్ సూర్యనగర్‌లో ఓ భవనంపై అంతస్తులో సెంట్రింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రసూల్‌పురా జోన్ సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షులు రజాక్, ప్రధాన కార్యదర్శి అంజయ్య, రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు బిల్లం మహేందర్ ఘటనా స్థలానికి చేరుకుని సంబంధిత బిల్డర్‌తో మాట్లాడి మృతుడి కుటుంబానికి 4.5 లక్షల ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు. సోమవారం కార్మికుడి కుటుంబానికి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు బీరయ్య, కోశాధికారి కనకయ్య, చైర్మన్ కాంతయ్య, సెంట్రల్ కమిటీ అధ్యక్షులు పి. కృష్ణ, చాంద్‌పాషా, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు మౌనప్రదర్శన



మదర్ థెరిస్సా విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: మణిపూర్‌లోని హింసకు వ్యతిరేకంగా బాధితులకు సంఘీభావం తెలుపుతూ తెలంగాణ ట్రాన్స్‌జెండర్ ఆధ్వర్యంలో మౌన ప్రదర్శన చేశారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద ట్రాన్స్‌జెండర్లు మాస్కులు ధరించి ప్లకార్డుల ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను అదుపు చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇవాంజిలిస్ట్, అంజలి, అడ్వకేట్ కాంతమ్మ, నీడ్ హెల్ప్ సంస్థ ఫౌండర్ చిన్నప్ప జాకబ్, మైఖేల్, జెరుసలేం మత్తయ్య, సోలొమన్ పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై మురుగు.. పరుగు



లాలాపేట: తార్నాక–లాలాపేట ప్రధాన రహదారిపై మురుగు నీరు ఏరులై పారుతుంది. లాలాపేటలోని మంజరి హాస్పిటల్ ఎదురుగా రహదారిపై గత రెండు రోజుల నుంచి మ్యాన్‌హోళ్లు పొంగి మురుగు రహదారి పారుతుండటంతో పాదచారులు, రోడ్డు పక్కన ఉన్న దుకాణాదారులు దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అసలే వర్షాకాలం విషజ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. ఈ మురుగుతో శ్వాసకోస వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలో దుర్గంధం వెదజల్లుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం తగదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.